# గుడ్ కపుల్ సిండ్రోమ్

కథ

గుడ్ కపుల్ కాంటెస్ట్!


పేరు పొందిన టీవీ ఛానెల్ వాళ్లు ఇచ్చిన ఆ ప్రకటనకి విపరీతమైన స్పందన లభించింది.

చదువూ, అందం, చేసే ఉద్యోగాలూ...వాళ్లిచ్చిన ప్రశ్నావళికి జంటలు ఇచ్చిన సమాధానాలు, వీటి ఆధారంగా జరిగిన వివిధ వడపోతల తర్వాత ఫైనల్స్‌కి చేరుకుంది కార్యక్రమం.

వేలంటైన్స్ డే సందర్భంగా ఆ రోజు ఫైనల్స్‌ని నిర్వహిస్తున్నారు.

మోహిత్‌కి ఎంతో ఉద్వేగంగా ఉంది.

ఫైనల్స్‌కి చేరుకున్న పదహారు జంటల్లో తమ జంట కూడా ఉండటమే అతని ఉద్వేగానికి కారణం.



**ఆకునూరి మురళీకృష్ణ**

అసలు అతని భార్య అంకిత ఆ పోటీలో పాల్గొనడానికి ముందు ఒప్పుకోలేదు.

''భార్యాభర్తల మధ్య అనుబంధాలకి పోటీ ఏమిటండీ విచిత్రంగా...అదీ టీవీ షోలోనా.. .అలాంటి కార్యక్రమాలు టీవీలో చూడడానికే ఎబ్బెట్టుగా ఉంటాయి. ఇంకా వాటిలో పాల్గొనడమా? నా వల్ల కాదు బాబూ'' అంది.

అది మామూలుగా టీవీల్లో వచ్చే 'మొగుడూ పెళ్లాల' కార్యక్రమం లాంటిది కాదనీ, చాలా విభిన్నంగా దీనిని నిర్వహిస్తున్నారని, ఎక్కువగా టీవీలో కనిపించాల్సిన అవసరం లేదని మోహిత్ పలు రకాలుగా నచ్చచెప్పి ఆ ప్రకటనలు చూపించాక కొంచెం మెత్తబడింది.

ఆ పోటీకి న్యాయనిర్ణేతలుగా వ్యవహరిస్తున్న వాళ్ల పేరు ప్రకటించాక మరింత మెత్తబడింది.

ఆ కార్యక్రమానికి జడ్జీలు ప్రఖ్యాత రచయితలు భార్గవీరావు దంపతులు!

ఆ దంపతుల రచనలంటే మోహిత్‌కీ, అంకితకీ కూడా ఎంతో అభిమానం.

చందమామ కథల దగ్గర్నుంచీ సినిమా కథల వరకూ వాళ్ళు సాహిత్యంలో చేపట్టని ప్రక్రియ అంటూ లేదు.

ఏ కథ రాసినా నేల విడిచి సాము చేస్తున్నట్లు కాకుండా వాస్తవాన్ని గుర్తించి ఆలోచింపజేసే విధంగా రాయడం వాళ్ల ప్రత్యేకత.

పత్రికల్లో పాఠకుల ప్రశ్నలకి వాళ్లిచ్చే సమాధానాలు ఎందరో జీవితాలకి కరదీపికలు! వాళ్ల రచనల్లో

కనిపించే మానసిక విశ్లేషణ అంటే ఎంతో ఇష్టం అంకితకి. అందుకే మెత్తబడి ఒప్పుకుంది ఆ పోటీలో పాల్గొనడానికి.

చెప్పినట్లుగానే ఆ పోటీని విభిన్నంగా నిర్వహిస్తున్నారు ఆ టీవీ ఛానెల్ వాళ్లు.

ఆటలూ, పాటలూ, మొగుళ్లకి చీరకట్టమనడం, మగాళ్లని వంట చేయమనడం లాంటి పోటీలేమీ లేవు.

భార్యా భర్తలని ఇబ్బంది పెట్టి నవ్వుకునే లాంటి ప్రశ్నలూ లేవు!

ఫైనల్స్‌కి ఎన్నికైన జంటలందరినీ ఆ టీవీ ఛానెల్ వాళ్లు తమ ఖర్చుతో గోవా తీసుకువెళ్తున్నారు. అక్కడ ఒక ఫైవ్‌స్టార్ హోటల్లో అందరికీ ప్రత్యేకమైన బస, సైట్‌సీయింగ్...ఆ రోజు సాయంత్రం హోటల్లో అందరికీ గెట్ టుగెదర్.

ఆ గెట్ టుగెదర్ పార్టీలోనే భార్గవీ రావు దంపతులు విజేతల పేర్లు ప్రకటిస్తారు.

ప్రయాణంలోనూ, హోటల్లోనూ, సైట్‌సీయింగ్ సమయాల్లోనూ మధ్యమధ్యలో టీవీ కెమేరా ఒక్కో జంటనీ తన ఇష్టానుసారంగా పలకరిస్తూ ఉంటుంది.. ఇదీ కార్యక్రమం.

ఆకాశాన్నుంచి భూమ్మీదకి దిగిన జంట నక్షత్రాల్లా ఉన్నారు అక్కడ చేరిన జంటలంతా.

అందరూ దాదాపు పాతిక సంవత్సరాల లోపు వాళ్లూ...కొత్తగా పెళ్లయిన వాళ్లే! అందంలో ఒకళ్లకొకళ్లు పోటీ పడుతున్నారు.

వీళ్లలో కార్పొరేట్ సంస్థల్లో పనిచేసే వారి దగ్గరుంచీ మధ్యతరగతి వరకూ అన్ని స్థాయిల వాళ్లూ ఉన్నారు. కానీ ఆ తేడా ఎక్కడా కనపడడం లేదు. అందరూ అందంగా అలంకరించుకుని ఆధునికంగా కనిపిస్తున్నారు.

ఆ పోటీలో ఫైనల్స్‌కి సెలెక్ట్ కావడమే పెద్ద బహుమతిలా ఉంది అందరికీ. ఎవరికి వాళ్లే పోటీలో ఫస్ట్ ప్రైజ్ తామే గెల్చుకోవాలని తహతహలాడిపోతున్నారు. మధ్య మధ్యలో కనిపిస్తున్న టీవీ కెమేరాలని ఉత్సాహంగా పలకరిస్తున్నారు.

అందమైన గోవా తీరం.

చుట్టూ ఎటు చూసినా తమ ఉద్రేకాన్ని మరింత రెచ్చగొడుతున్న పడుచు జంటలు.

మీ సత్తా ఏమిటో నిరూపించుకోమంటున్నట్లు..పోటీ!

టీవీ కెమేరాల వాళ్లు ఏ అవకాశాన్నీ వదులుకోవడం లేదు.

అందరూ రెచ్చిపోయి బీచ్‌లో స్వేచ్ఛా విహారం చేస్తున్నారు.

ఒకరి నడుము చుట్టూ మరొకరు చేతులేసుకుని తిరిగే జంటలు కొన్ని..

అక్కడే కౌగిళ్లలో ఒదిగిపోయి స్వీట్ నథింగ్స్ చెప్పుకుంటున్న జంటలు మరికొన్ని...

కొందరైతే ఏకంగా బికినీలు ధరించి సముద్ర స్నానం చేస్తూ సరససల్లాపాల్లో తేలిపోతున్నారు.

కొన్ని జంటలు బృందంలా కలిసిపోయి బీచ్ వాలీబాల్ ఆట మొదలుపెట్టేశారు.

మొత్తంమీద అక్కడి వాతావరణాన్ని చూస్తే రతీమన్మథులకే మతిపోయేట్టుగా ఉంది.

దూరంగా ఇసుకలో కూర్చున్నారు మోహిత్, అంకితలు.

ఆమెకి కొంచెం దగ్గరగా జరిగి ఆమె వెనుగ్గా చేయి వేసి ఎవరూ చూడకుండా చీరకీ జాకెట్‌కీ మధ్యనున్న ఖాళీప్రదేశంలో ఆమె నడుము ఒంపులో వేళ్లతో సుతారంగా నొక్కాడు.

అంకిత ఉలిక్కిపడి చూసిందతని వంక.

''ఏంటలా హడలిపోతావు? మనమిలా దూరం దూరంగా టచ్‌మి నాట్ లా కూర్చుంటే అసలు మనం భార్యాభర్తలమేనా అన్న అనుమానం వస్తుంది ఆ టీవీ వాళ్లకి. వాళ్లందర్నీ చూడు'' అంటూ మిగిలిన జంటలని చూపించాడు.

''బోడి ప్రైజు కోసం నలుగురిలోనూ రెచ్చిపోతూ కనిపించాలా?'' నిరసనగా అంది అంకిత.

''రోమ్‌లో ఉన్నప్పుడు రోమనుల్లాగే ప్రవర్తించమన్నారు''

అంకిత సిగ్గుపడుతూనే అతనికి దగ్గరగా జరిగింది.

ఆమె స్పర్శ ఎంతో పరిచయమున్నదే అయినా... ఆ క్షణంలో ఆమె అలా దగ్గరగా రావడం ఎంతో గొప్ప అనుభూతినిచ్చింది అతనికి.

సిటీలో బయటికెళ్లినపుడూ, పార్టీల్లోనూ చాలామంది జంటలని చూస్తూ ఉంటాడు.

చుట్టూ ఎంత మంది ఉన్నా ఆ స్పృహే లేనట్టుగా ఒకరిలోకి ఒకరు ఒదిగి పోతూ చెవుల్లో తీపి కబుర్లు చెప్పుకుంటూ చిలిపి నవ్వులతో తుళ్లిపడే జంటలు.

బైక్‌ల మీద దాదాపుగా ఒకళ్లనొకరు కౌగిలించుకుంటున్నట్లుగా కూర్చుని దూసుకుపోయే ఆధునిక యువజంటలు.

అలాంటి వాళ్లని చూసినపుడల్లా తనకెంతో దిగులుగా ఉంటుంది. అంకిత తను నలుగురిలోనూ ఉన్నప్పుడు చేయి పట్టుకుంటేనే ముడుచుకు పోతుంది.

అసలు ఆమెకి ఉన్న ఆ బెరుకుని పోగొట్టాలన్న ఉద్దేశంతోనే ఈ పోటీలో పాల్గొందామన్నాడు.

తన పక్కనే ముగ్ధలా ముడుచుకొని కూర్చున్న అంకితని పరిశీలనగా చూశాడు.

మూర్తీభవించిన సౌందర్యంలా ఉందామె.

గాలికెగురుతున్న ఆమె కురులు ఎగసి పడుతున్న సముద్ర కెరటాలతో పోటీ పడుతున్నాయి.

## మనీ పవర్

**'సినిమాల్లో నటించినా, సీరియల్స్‌లో విభిన్నపాత్రలు పోషించినా డబ్బు సంపాదనే కదా పరమావధి' అంటోంది కింశర్మ. రోజురోజుకీ సినిమాల సంఖ్య తగ్గిపోతుండడంతో తారలంతా బుల్లితెర వైపు తమ దృష్టిని కేంద్రీకరిస్తున్నారు. టీవీ సీరియల్స్ ఇంతగా ప్రజాదరణ పొందడానికి కారణం అవి వాస్తవిక జీవితాలకు అద్దం పట్టడమేనని అంటోంది ఈ భామ. సినిమాలు లేకపోతే ఎలాంటి రిస్కూ లేని టీవీ సీరియల్స్ వైపు మొగ్గుచూపడం సబబే అని ఆమె తోటితారల ప్రస్థానంపై వ్యాఖ్యానిస్తోంది.**



ఆమె పాదాల సౌకుమార్యాన్ని చూసి కాళ్లకిం దున్న ఇసుక ఫీలవుతున్నట్లుగా ఉంది. ఆమె శరీ రంలోని మిగిలిన భాగాల ఒంపుసొంపుల గురించి తెలిస్తే ఆ ఇసుకతిన్నెలింకేమైపోతాయో...నవ్వొ చ్చింది మోహిత్‌కి.

లేత తమలపాకులా ఉన్న ఆమె అరచేతిని తన చేతిలోకి తీసుకున్నాడు. వేళ్ల మధ్యలోకి వేళ్లు జొనిపి సుతారంగా ఆమె చేయిని నొక్కాడు.

అతను చేస్తున్న పనిని ఎవరూ చూడకుండా అతని చేతిమీద తన పైట కొంగుని అందంగా కప్పింది అంకిత.

★ ★ ★

చీకటి పూర్తిగా చిక్కబడ్డాక హోటల్ టెర్రస్ మీద మొదలయింది గెట్ టుగెదర్ పార్టీ.

ప్రకృతి కాంత కప్పుకున్న మేలి ముసుగు మీది చెమ్కీల్లా మెరుస్తున్నాయి ఆకాశంలోని నక్ష త్రాలు. వాటితో పోటీ పడుతున్నట్లుగా వెలుగుతు న్నాయి విద్యుత్ దీపాలు. ఆ కాంతిలో ధగధగా మెరిసిపోతున్నాయి యువజంటలు.

అందరి మనసులూ ఉద్విగ్నంగా ఉన్నాయి. పదహారు జంటల్లోనూ 'గుడ్ కపుల్'గా ఎన్నికయ్యే మహత్తర అవకాశం ఎవర్ని వరిస్తుందా అన్న టెన్ష న్‌ని తట్టుకోలేకపోతున్నారు. అంతలో అక్కడ చిన్నగా కలకలం మొదలైంది. అందరి దృష్టీ ఆ జంట మీదకి మళ్లింది.

టీవీ కెమెరాలన్నీ అటువైపు తిరిగాయి.

ఉత్తరాది నుంచి వచ్చిన ఒక జంట ఒకరినొకరు పట్టుకుని సంగీతానికనుగుణంగా నృత్యం చేస్తు న్నారు. అంతలో హఠాత్తుగా ఆ యువకుడు ముందుకు వంగి తన నోటితో ఎర్రగా మెరుస్తున్న ఆమె పెదవుల్ని అందుకున్నాడు.

చంద్రబింబంలా ఉన్న ఆమె ముఖాన్ని రెండు చేతుల్తోనూ పట్టుకుని కొద్దిగా వంచి మరింత గాఢంగా ఆమె పెదాలని చుంబించసాగాడు. ఆమె చేతులు అతని నడుము చుట్టూ అల్లుకున్నాయి.

చూస్తున్న వాళ్లంతా అప్రతిభులై అలాగే ఉండి పోయారు. మరుక్షణంలో తేరుకున్న వాళ్ల చప్ప ట్లతో ఆ ప్రదేశం మొత్తం మార్మోగిపోయింది.

అంకితని మోచేత్తో పొడిచాడు మోహిత్ ఆ దృశ్యాన్ని చూపిస్తూ.

చూడ్డానికే రతీమన్మథుల్లా ఉన్నారా జంట. పైగా ఇప్పుడు ఆ చర్యలో అందరి దృష్టినీ తమ వైపు తిప్పుకున్నారు.

అక్కడ ఉన్న మిగిలిన పదిహేను జంటలూ ప్రైజుమీద ఆశని వదిలేసుకున్నారు.

''బహుమతి పొందాలంటే అలా 'కింద మీదా' పడాల్సిందే మరి. మనం కూడా ప్రయత్ని ద్దామా?'' అంకిత చెవుల్లో గుసగుసగా అన్నాడు మోహిత్.

''సిగ్గు లేకపోతే సరి..'' అంది అంకిత ఎర్రబడ్డ ముఖంతో.

అంతలోనే యాంకర్ వచ్చి జడ్జీలు భార్గవీరావు దంపతులని ఆహ్వానించింది.

అందరి దృష్టీ వాళ్లమీదకి మళ్లింది.

పోటీలో విజేతలెవరన్న సస్పెన్స్‌కి తెరదించడా నికన్నట్లుగా రావుగారు మైకు అందుకున్నారు.

''అందం చూసే వాళ్ల కళ్లల్లో ఉంటుందం టారు. అలాగే అనుబంధం అనేది అనుభవించేవాళ్ల మనసుల్లో ఉంటుంది. ఈ సృష్టిలో దేనికైనా కొల మానం ఉంటుందేమో కానీ ఇద్దరు మనుషుల మధ్య వుండే అనుబంధాన్ని కొలవడానికి ఏ కొల మానం ఉండదు. ఆ విధంగా చూస్తే ఈ 'గుడ్ కపుల్ కాంటెస్ట్'కి అర్థం లేదు. అసలీ కార్యక్రమం నిర్వహించడం వెనుకనున్న అసలు ఉద్దేశం కూడా 'పోటీ'ని నిర్వహించడం కాదు.''

అందరూ నిశ్శబ్దంగా వింటూ ఉంటే రావు గారు మెల్లగా కొనసాగించారు. ''ప్రేమ పట్ల, భార్యాభర్తల అనుబంధం పట్ల నేటి యువతీ యువకుల మనోభావాలెలా ఉన్నాయో వారి జీవన విధానం ఎలా ఉందో యథాతథంగా చూపించడమే ఈ కార్యక్రమం యొక్క అసలు లక్ష్యం. అందుకు మీ అందరికీ తగినంత స్వేచ్ఛనిచ్చి మీ అనుభూతు లనీ, అభిప్రాయాలనీ తెలుసుకున్నాం. అయితే పోటీ అని ప్రకటించాక విజేతలని కూడా ఎంపిక చేయాలి కనుక మీలోంచి ఒక గుడ్ కపుల్‌ని కూడా సెలెక్ట్ చేశాం. ఇక్కడ మీకో ముఖ్యమైన విషయం చెప్పాలి. ఈ పోటీలో ఫైనల్స్‌కి ఎన్నికయింది పద హారు జంటలు కాదు. పన్నెండు జంటలే. మిగిలిన నాలుగు జంటలూ మీతోపాటూ పోటీలో పాల్గొం టున్నట్లు నటిస్తూ మిమ్మల్ని గమనించడానికి మేము నియమించిన సైకాలజీ విద్యార్థులు!''

వింటున్న వాళ్లంతా ఆశ్చర్యంతో నోరు వెళ్లబె ట్టారు.

''ఆ బృందం అందజేసిన నివేదిక ఆధారంగా ఎన్నికైన గుడ్ కపుల్... అంకిత, మోహిత్‌లు!!''

వింటున్న మోహిత్, అంకితలు తమ చెవుల్ని తామే నమ్మలేకపోయారు. అందరూ వచ్చి అభినం దించసాగారు. వారి తర్వాత మరికొందరు గుడ్ కపు ల్స్‌ని కూడా ప్రకటించారు. వాళ్లలో ఆ ఉత్తరాది నుంచి వచ్చిన జంట కూడా ఉంది.

★ ★ ★

జరిగినదంతా మోహిత్‌కీ, అంకితకీ ఒక పజి ల్‌లా ఉంది.

అక్కడ అంతమంది అన్యోన్యంగా కనిపించే జంటలున్నా తమలాంటి మామూలు జంటని 'గుడ్ కపుల్'గా ఎలా ఎంపిక చేశారో అర్థం కావడం లేదు.

అందుకే ఆ రాత్రి భార్గవీరావు దంపతులతో పర్సనల్‌గా మాట్లాడకుండా ఉండలేకపోయారు.

''మీరు పోటీని నిర్వహించిన తీరులో మీ శైలి కనపడింది. మాకు తెలియకుండా మా మధ్య సైకాలజీ స్టూడెంట్స్‌ని ఉంచడంలో రచయితగా మీ తెలివితేటలు బయటపడ్డాయి. కానీ నాకు అర్థంకానిదొక్కటే. గుడ్ కపుల్‌గా మమ్మల్ని ఎంపిక చేయడం వెనుకనున్న లాజిక్ ఏమిటన్నదే... అసలు అందరి ముందూ నిస్సంకోచంగా ఒకరినొకరు ముద్దుపెట్టుకుని ప్రేమించుకోగల ఆ ఉత్తరాది జంటకి ఫస్ట్‌ప్రైజ్ వస్తుందనుకున్నాం. కానీ వాళ్లనె క్కడో నాలుగో స్థానంలో ఉంచారు.''

మోహిత్ మాటలకి చిరునవ్వు నవ్వారు రావు గారు.

''మెరిసేదంతా బంగారం కాదని ఒక సామెత ఉంది. అలాగే ఇక్కడ మీకు తెలియని విషయం ఇంకొకటుంది. మీ తర్వాత గుడ్ కపుల్‌గా ప్రకటిం చిన వారెవరూ నిజమైన గుడ్ కపుల్స్ కారు. వాళ్లని మేము సైకలాజికల్ కౌన్సిలింగ్ కోసం ఎంపిక చేశాం'' అన్నారు రావుగారు.

''కౌన్సిలింగ్ దేనికి?'' అడిగాడు మోహిత్ మరింత ఆశ్చర్యంగా.

''వాళ్లు గుడ్ కపుల్ సిండ్రోమ్ నుండి బయట పడి, నిజమైన గుడ్ కపుల్స్‌గా మారడానికి!''

''గుడ్ కపుల్ సిండ్రోమా? అంటే?'' అడి గాడు మోహిత్.

''ఆధునిక జీవన విధానంలో ఉండే ఒత్తిళ్ల వల్ల నేటి తరం జంటల్లో అవగాహనా రాహిత్యం, చిన్న చిన్న విషయాలకే గొడవ పడడం ఎక్కువైపో తోంది. ఇదంతా ఎవరికీ తెలియకుండా నాలుగు గోడల మధ్యా జరిగిపోతోంది. నలుగురిలోకి వచ్చే సరికి మాత్రం అందరూ తమనెక్కడ అన్యోన్యత లేని దంపతులనుకుంటారో నన్న ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్‌తో కొంచెం 'అతి'గా ప్రవర్తిస్తుంటారు కొంతమంది. దాన్నే ముద్దుగా గుడ్ కపుల్ సిండ్రోమ్ అంటారు. అలాంటి జంటలని మీ మధ్య నుంచి జాగ్రత్తగా గుర్తించారు మా సైకాలజీ స్టూడెంట్స్. ప్రైజ్ వంకతో వారి ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్‌ని పోగొట్టి నెమ్మదిగా కౌన్సిలింగ్ చేస్తున్నాం. భార్యాభర్తల మధ్య అవగాహన పెంచే ఇలాంటి కౌన్సిలింగ్ చేయడం రచయితలుగా మాకలవాటే. కానీ మీరు మాత్రం నూటికి నూరు మార్కులు పొందిన నిజమైన గుడ్ కపుల్! అందులో సందేహం లేదు.''

అంకిత, మోహిత్ ఆయన చెప్పినదంతా ఆశ్చ ర్యంగా విన్నారు.

వాళ్లమీద గౌరవం మరింత పెరిగింది ఇద్దరికీ.

''మనకొచ్చిన ప్రైజ్‌మనీ లక్ష రూపాయలు ఏం చేద్దాం?'' అడిగాడు మోహిత్ అంకితని రూమ్‌కి వచ్చాక.

''వాళ్లు చేస్తున్న కౌన్సిలింగ్‌కయ్యే ఖర్చుకి విరా ళంగా ఇద్దాం'' అంది అంకిత ఆనందంగా. ☆